# కళారాధకులు

రచన:
ద్రోణంరాజు కృష్ణమోహన్

ఏఁవండి.......ఎప్పు డెళ్దాం మెద్రాస్? పరిచయమైన రెండోరోజునే అడిగింది లత.

"అంత తొందరయితే ఎలా? ఎవరికైనా ఉత్తరం రాయాలి, వాళ్ళదగ్గిర్నుంచి జవాబు రావాలి. ఇల్లు వాకిలి ముందుగా కుదుర్చుకోవాలి. అసలు ఫీల్డెలావుంటుందో తెలుసుకోవాలిఁదా ముందు" ఆలోచిస్తూ చెప్పాడు మూర్తి.

"పొండీ.......మీరు తల్చుకుంటే ఎంతసేపు? సినిమాల్లో అంతా తెలుసన్నారుగా" చిన్నపిల్లలా మారాంచేసింది.

"తెలుసనుక్కో......అయినా కోళ్ళేరుకుంటున్నాయా వేషాలు?" అంత తేలిక కాదన్నట్లు చెప్పాడు.

"మొదట్లో ఏఁవన్నా డబ్బు ఖర్చవుతుందా?" అమాయికంగా అడిగింది.

'కాదూ మరి? ఇట్టే వెళ్ళగానే అట్టే అగ్రిమెంట్లు, అడ్వాన్సులు, స్టేషను దగ్గిర కాసుక్కూచుంటాయా? పిచ్చిపిల్లా....' నవ్వాడు బుగ్గలు పిండుతూ.

'అయ్యబాబోయ్! అమ్మ దమ్మిడీ ఇవ్వదు. ఆవిడ మైండ్ మీ కసలు తెలియదు. మెద్రాస్నుంచి వాళ్లే సరాసరొచ్చి అగ్రిమెంటు చేసుకుని, మొత్తం డబ్బుతోసహా ఫస్ట్‌క్లాస్ రైలు ఛార్జీలు కూడా ఇవ్వాలనే రకం.' అమ్మ సంగతంతా చెప్పింది.

'మరైతే మీ అమ్మకి చెప్పకుండా రాగలవ్?'

'ఓ.......నాకేం భయం, మీ రుండగా?' మీద చేతులు రెండు వేసింది.

'అయితే నిన్ను సినిమాలో చేర్పించేదాకా పెట్టుబడంతా నాదేనన్నమాట' కొండంత భారం మోస్తున్నట్లు నటించాడు.

'మరేం భయపడకండి....మీ డబ్బు నాది కాదా....నా డబ్బు మీది కాదా....నేనే మీ దాన్నిగా' క్రాఫింగు కొంటెగా రేపేసింది.

'నువ్వు నా దానివి ఈ క్షణమే....రేపు మళ్ళీ ఈ వేళకి ఎవరు డబ్బు తెస్తే వాళ్ళ దానివి. కాదా?' బుజాలు పూపుతూ అడిగాడు.

'ఒట్టు....నిజం....నమ్మండి .... మెద్రాస్ తీసుకెళ్లేదాకా మీరు తప్ప ఇంకోడి మొహం చూస్తే అడగండి' చేతిలో చేయి వేసింది.

'ఆ తరువాత ఇంకోరి దానివవుతావా....'

అతని మాట కడ్డంవొచ్చి చేతితో నోరు మూస్తూ 'ఏఁవిటా కొంటె మాటలు ? నే నన్నానా అల్లా?' జడలో మల్లె చెండుతీసి అతని మొహంమీదవేసి మంచం వెనుక ఉన్న స్విచ్ ఆఫ్ చేసింది....

* * *

'అమ్మయ్య....ఇహ ఫరవాలేదు' రైలు కదిలీ కదలగానే ఏదో భయం తీరినట్టుగా అంది లత.

'మీ అమ్మ, మాఁవయ్య పసిగట్టొస్తే?'

'వస్తే ఉంటారు....ఇష్టం లేకపోతే వెళ్తారెనక్కి వాళ్లే' నిర్భయంగా చెప్పింది.

'మీరంతా కలిసి చివరకు నన్నెళ్లగొట్టరు గదా?'

'అబ్బ.... ఎంత గడుగ్గాయిలండీ....నే చేసిన ప్రమాణానికి నిలబడ్డానా లేదా ఈ రెండు నెల్లూ. డబ్బు తెచ్చినా తేకపోయినా మీరు?' అతని ఒళ్ళో ఒరిగింది.

'ఏవో....గొప్పతారవి కాగానే నా మొహం కూడా చూడవేమోలే....' భయపడుతున్నట్లు గట్టిగా అన్నాడు. పకపక నవ్వింది లత.

'ఎందుకలా ఊరిస్తార్చెప్పండి. అబ్బ.... గొప్పతార! ఆహా....ఎప్పటికో....ఆ భాగ్యం ఉందో లేదో!....ఉన్నా లేకపోయినా మిమ్మల్ని వదల్ను.'

* * *

'ఇంట్లో లేరాండి?' తలుపుదగ్గిరనుంచుని అడిగాడు విజయ్.

మంచి సూట్ వేసుకున్నాడు. సెంటు వాసనలు విరజిమ్మాయి అతని బూట్లు దగ్గిర్నుంచి జేబు రుమాలు వరకూ.

'ఇంకా రాలేదే....' గుమ్మం దగ్గిరకొచ్చి చూసి 'అయ్యో....మీరా....రండి....' అంటూ పిలిచింది.

'ఆయన స్టూడియోకొస్తానని రానేలేదే.... సిగరెట్ పొగ వదలడంలో ఒక క్రొత్త ఫక్కి చూపించాడు లతకి.

'ఇప్పుడే వెళ్లారు ఓ అరగంటయింది. ఆయ నెవరబ్బా....ఆయన పేరేఁవిటో.... మొన్న మీతోపాటొచ్చి మాట్లాడెళ్ళాడే'

'ఆఁ....ఆఁ....వొచ్చాడా మళ్ళీ జానకిరామయ్య?' ఆతృతగా అన్నాడు.

'ఊఁ....కారులో వెళ్ళా రిద్దరూ....అయినా తమరు మళ్ళీ వస్తానదిగోనంటూ పది రోజుల కొచ్చారేఁవండి సార్....' ఒయ్యారంగా కళ్ళు తిప్పుతూ అన్నది.

'ఎక్కడా....బోలెడు పనులు....పెట్టుబడి వాళ్లదీ....మేనేజింగంతా నాది....తీరికెక్కడ చెప్పండి?' మహా సినిమాఫీల్డు భారమంతా మోస్తున్నట్లే అన్నాడు చిరాగ్గా.

'అవున్లెండి. తమ కంటికి మా ఈ చిన్న కొంప కనపడ్డుగా....' కోపం నటించింది.

'నే ఒచ్చెళ్ళానని చెప్పండి' అంటూ లేచాడు.

'తొందరేం.... కాస్తంత కాఫీ పుచ్చుకెళ్లచ్చు' లోపలకెళ్ళింది. ఐదు నిముషాలలో కాఫీ, ఉప్మా, పట్టుకొచ్చింది.

'ఇవన్నీ ఎందుకో....'

'తమ అనుగ్రహం కావాలిగా....' నవ్వింది తలుపేస్తూ.

'ప్రయోజనం వుండదేమో....'

'ఉంటుందనేగా ఆశ....' దగ్గిరగావచ్చి నిలబడింది.

అతను ఆమెను దగ్గరకు తీసికున్నాడు.

* * *

'ఏవిటిది లతా మరీ బొత్తిగా....ఎబ్బెబ్బే' విసుక్కున్నాడు మూర్తి ఒక రోజు.

'ఏం చెయ్యమంటార్చెప్పండి.... మీ సొంత డబ్బు వెయ్యి రూపాయలు, నా రెండు వేల రూపాయల నగలు హరించిపోయాయి. ఒక్క ముండాకొడుక్కి దయ గలగదు అంతా నా అందంకోసం ఏడ్చేవాళ్ళే. ఒచ్చి ఆరు నెల్లయినా అతీగతీ లేదు".

'అందుకని అడ్డమైన వెధవకీ ఒళ్లప్పగిస్తావా? నీకేవన్నా పరువు, మర్యాద ఉండాలా?' కోపంగా అన్నాడు.

'పోనీ ఏం చెయ్యమంటారో చెప్పండి.... ఇంటి కెళ్లడం నాకు చచ్చినా ఇష్టం లేదు.' కళ్లవెంట రెండు చుక్కలు రాలాయి,

మూర్తిది మెత్తటి మనస్సు. లత కన్నీటికి కరిగిపోయాడు. పైగా ఎన్నో ఆశలుపెట్టి తనకు బోలెడు పలుకుబడుందని నమ్మించి తీసుకొచ్చాడు.

'వెళ్లద్దులే లతా.... ఇహ పది రోజులలో చూడు. తప్పకుండా దొరుకుతుంది" ధైర్యం చెప్పాడు దగ్గిరకు తీసుకుంటూ. అమె మొహం వికసించింది.

'మీరు కూడా నా పిక్చరులోనే అసిస్టెంట్ డైరెక్ట రుద్యోగం చూసుకోండీ' సలహా ఇచ్చింది.

'అందుకేగా ఈ తంటాలు' కన్నీరు తుడిచి ముద్దు పెట్టుకున్నాడు.

లతకి ఎంతో అభిమానం, ప్రేమ ఉన్నాయి. అతను పైకి రావాలనే తనూ కోరుకుంటోంది. అందుకే అన్నీ సహిస్తోంది. మూర్తికిగల కళాభిరుచి తనకు తెలుసు.

* * *

"ఏం నచ్చిందా పోర్షన్?" రిహార్సలై ఇంటికి రాగానే అడిగాడు.

"ఏం నచ్చడమో....అబ్బ.... ప్రాణాలు పోతున్నాయ్" అంటూ మంచంమీద వాలిపోయింది.

"ఏం? ఎందుకని? మంచి క్యారెక్టరే దొరికిందిగా" ప్రక్కలో కూర్చుని జుట్టు సర్దుతూ అడిగాడు.

"ఏం మంచి! ఎంత బాగా నటించినా ఆ డైరెక్టరు రాజుకి తృప్తేలేదు. ఒళ్లు హూనం చేస్తున్నాడు. తగని చాదస్తం, కోపం".

"నువ్వంటే చాలా ఇష్టంగా వాడికి!" కొంటెగా చూస్తూ అన్నాడు.

"మరి....ఎవరికిష్టంలేదు నేనంటే.... ఆ ప్రొడ్యూసరు ముండాకొడుక్కి....వాడి దుంపతెగ....వాడి ఆకారం, వాడూ....అబ్బ! ఆ బొజ్జ, బట్టతల, దిబ్బమొహం అన్నీ తల్చుకుంటే తిన్నది కాస్త వెళ్లిపోతుంది. వాడి క్కూడా నే కావాల్ట. వాడి అందానికి తోడు పైగా నన్ను ఊటీ తీసుకెడతాట్ట మొహం.... మొహంవాడని! బొత్తిగా జ్ఞానం లేదండీ వాడికి. నలుగురెదుట కూడా నామీద మీదకి రాబోతాడు వాడి రొమాన్స్ తగలెయ్య!" పక పక నవ్వింది.

"మరి నువ్వేమన్నావ్?"

"మీరు చెప్పండి"

"నీ ఇష్టం....స్వతంత్రురాలివి"

"అబ్బ....మహానేర్చారు" చెవులు మెలిపెట్టింది.

"చెప్ప లతా....నిజంగా వెళ్తావా...." బుగ్గలు వత్తుతూ అడిగాడు.

"సినిమా రిలీజై డబ్బు చేసుకుంటే అలాగే చూస్తానని చెప్పా"

"ఈ వెధవల కదే రోగం! డబ్బు, అధికారం....పైగా ధర్మోపన్యాసాలిస్తారు కాలేజీ అమ్మాయిలు, సంసారాలు చేసేవాళ్లు కూడా చేరమని! మనవలు, మునిమనవలు పుట్టుకొస్తున్నా ఈ జబ్బు వదల్దు. ఇదీ వీళ్ళు చేసే కళాసేవ!"

"పోనీలెండి....ఇప్పుడెవరెళ్లొచ్చారు వాడ్తో" అతన్ని దగ్గరకు తీసికుంది.

* * *

"ఎంతో కష్టపడి సంపాదించా నీ క్యారెక్టర్ నీకు. చాలా పెద్దది. నీది కందటి పిక్చర్ ఫెయిలైనా నచ్చజెప్పా మా ప్రొడ్యూసర్కి, డిస్ట్రిబ్యూటర్కి. నా పరువెలా కాపాడ్తావో "డైరెక్టరు నాగ్ లైటువేసి ఫ్యాన్ స్విచ్ఆన్ చేశాడు, గదిలో అడుగుపెట్టగానే లతకి ఈ ప్రపంచమే మరిచిపోయినట్లయింది. ఎంతో చక్కగా అలంకరించివుంది. విశాలమైన బంగళా. చుట్టూ అందమైనతోట ఎదురుగా మైదానం.

"నిన్నే....వినపడిందాపిల్లా" జడ పుచ్చుకు లాగాడు. చర్రున వెనక్కి తిరిగింది లత.

"ఏంవిటండీ మీరు కూడా...."

"ఏం....నేను మాత్రం మనిషినిగానా?.... చెప్ప" దగ్గిరకొచ్చి చేయి పట్టుకున్నాడు.

"అబ్బ....వొదలండి....పోర్షన్ చెపుతానని తీసుకొచ్చి ఇదేం ధర్మం చెప్పండి" మాటల్లో ఆవేదన, అసహ్యం, వ్యక్తమైనాయి. ఎప్పటి కప్పుడు ఎదురు తిరుగుదామనే ప్రయత్నం. కాని సాగటం లేదు. ప్రతి వెధవా తన అందం కోసం ఏడ్చేవాడే!

"ఏదో వింతగా ఉందే నీ వెవ్వారం....అంబలే! ఇంత బెట్టుగా ఉంటే ఎలా? మొన్నెప్పుడో మేకప్ నరేంద్రాన్ని తోసిపారేశావుటే; మన కత్తో ఎంత పనుందో తెలుసా? నువ్వు పనికి రావని ప్రొడ్యూసర్కి చెప్పాడంటే ఇహ నా మాట కూడా సాగదు తెలుసా?"

"మీ కంటే కోపం(వొస్తుందే)వో గాని.... ముగ్గురు పిల్లలు, చక్కటి పెళ్లాం ఉంటే మాబోటి వాళ్లకోస మెందుకెగబడ్తారిలా చెప్పండి. బాగా చదువుకున్నవారు గదా...."

"ఆ పెళ్లాం మొహం చూస్తేనే డోకొస్తుంది. ఏదో వేళ కింత కమ్మగా వండి పడెయ్యడానికి ఎవరూ లేకపోతే అవసరానికి సర్దుకోడానికి, లేవలేకపోతే ఛూడ్డానికితప్ప ఇంకెందుకా మొహం!" అన్నాడు. అది వికటంగా తోచింది. కట్టుకున్న పెళ్ళాన్ని గురించి పరాయి ఆడదానిదగ్గర, ఎం. ఏ. చదివి కళా సేవకు పూనుకున్న ఆ మనిషి అలా ఎలా అనగలుగుతున్నాడో అర్థం గాలేదు.

"పోనీ మీరు పనికొస్తారని మీ ఆవిడ అనుకుంటుందా?"

ఛెళ్ళుమంది. వ్రేళ్ళు తేరాయి. జలజల నీళ్ళు కారాయి.

"ఉన్నమాటంటే అంతెందుకండీ? .... అవును. మీ దయమీద ఆధారపడ్డాను" ఎదురుగా వెళ్లినుంచుంది కళ్ళు తుడుచుకుంటూ.

"ఛీ....ఛీ....పో....పో....ఇంత ఏడుపుగొట్టు మొహం, నా కెందుకు? అక్కర్లేదు" రుసరుసలాడుతూ వెళ్లిపోబోయాడు.

"ఆగండి....క్షమించండి....మీ పాదాలు పట్టుకుంటా....ఊరికే మీ మనస్సు కనిపెడ్దామని అలా అన్నా—అంతే....ఇంతకోపం

వస్తుందనుకోలేదు....రండీ....రమ్మంటేనూ.... అబ్బ...." నవ్వుతూ, ఒయ్యారంగా లాక్కుంటూ దారితీసింది ప్రక్కగదిలోకి.

* * *

లత నటించిన రెండో పిక్చర్ బాక్సాఫీస్ హిట్ అయింది. పైగా లత నృత్యానికి, యాక్షన్‌కి, అమాంతంగా పేరూ, ఊరూ వచ్చేశాయి. వెంటనే కోటీశ్వరుడు చిన్నప్ప తన రెండు పిక్చర్లకు పిలిచాడు.

"నీ ఇష్టం....కోరుకో....ఛాయిస్ నీకే. ఏంతంకె వెయ్యమన్నావ్?" సోఫాలో కూర్చుని తన కాళ్లకు లత కాళ్ళు కలిపి ఊపుతూ అడిగాడు.

"మీ దయ అన్నాగా...."

"నా దయ ఎప్పుడూ ఉంది. నీ దయే లోటు." దబుక్కున లేచొచ్చి కౌగలించుకున్నాడు. లత వారించలేకపోయింది లోపల మంట లెత్తుకొస్తున్నా.

"ఎండలు ముదిరాయి. ముందు సిమ్లా డార్జిలింగు చూసొద్దామా?" అడిగాడు ఎంతో ప్రేమతో.

"అయనేమంటారో!" సందేహం వెలిబుచ్చింది. నిజానికి తనకే ఇష్టంలేదు.

"పారెయ్ ఓ వెయ్యి రూపాయలు. మనం వచ్చేదాకా తింటూ వుంటాడు." ఉదారమైన సలహా ఇచ్చాడు చిన్నప్ప.

"ఊఁ...." తలూపింది....ఏంవని ధిక్కరిస్తుంది మరి?

* * *

నెల్లాళ్లపాటు దేశం తిరిగొచ్చింది లత. లోపల బాధగానేఉంది. చేసిన పనికి.

* * *

"ఏమిటిది లతా....చాలా అవమానంగా ఉంది. అందరికీ తెలిసిపోయింది. వెధవ 'పేపర్లవాళ్ళు పసిగట్టుకు డబ్బా వాయించారు' విసుక్కున్నాడు మూర్తి.

"ఏడిశార్లెండి .... కుళ్లుమోతు ముండాకొడుకులు! ఏడుపుగొట్టు వెధవలు. ఎందుకనూర్కున్నాగాని లేకపోతే ఒక్కొక్కడిమీద కేసులు తగిలించి పేపరు మూయించడం ఎంత సేపు?"

"నువ్వు చేసింది మహా బాగున్నట్లు!"

"ఏం చెయ్యమంటారు చెప్పండి. పోనీ ప్రాణం విసుగొస్తోంది. ఎంత నీతిగా వుందామనుకున్నా వాళ్లు వేధించుకు తింటున్నారయ్యో!" నచ్చజెప్పడానికి శాయశక్తులాప్రయత్నించింది.

"నా సంగతేవన్నా చెప్పావా గట్టిగా మరి? ఎన్నాళ్లిల్లా ఈ అసిస్టెంటు చాకిరీ వాడికింద, వీడికింద!" ధోరణి మారుతున్నందుకు లత చాలా సంతోషించింది.

"ఆఁ....అన్నట్టు మరిచా చెప్పడం మీతో, మీకు తప్పకుండా సరాసరి డైరెక్టరు ఛాన్సొస్తుంది నే యాక్ట్ చేసే పిక్చర్స్ రెంటికీ. ఏ ఒక్కటి బాగా డబ్బు జేస్తున్నా మనం కొండెక్కామన్నమాటే." తీవిగా అంది.

"అప్పుడన్నా చిన్న చిన్న వెధవల బాధ తప్పుతుంది. పెద్ద వాళ్లు కూడా నీ గుమ్మం దగ్గిర పడిగాపులు పడుంటారు." ఇక నుంచి అంతా చాలా దర్జాగానే జరుగుతుందన్నట్లు చెప్పాడు.

* * *

మూర్తి ఇప్పుడు ఒక పేరు గల డైరెక్టరు. లతాదేవి అక్షరాలా అతని అర్థాంగి. ఇందుకు ప్రబల నిదర్శనం శాస్త్రోక్తంగా లత మెడను అలంకరించిన ఆ పవిత్రమైన మంగళ సూత్రం. సరే సౌఖ్యాలకేం లోటు! విశాలమైన భవనం, కారు, నౌకర్లు, రెండు కుక్కలు వాళ్లిప్పుడు కళారాధకులు. అన్నిటికన్నా చెప్పుకోతగినది వారి ఆదర్శ దాంపత్యం. ఒకరిమాట కొకరు ఎదురు చెప్పరు.

★


# కస్తూరి మాత్రలు

జలుపు, సాధారణ శీతలముచేత దగ్గులు, జ్వరము, గొంతులో కరకరమని యుండుట తల భారము మొదలగువాటిని పోగొట్టును. ఈమాత్రలు బిడ్డలుమొదలు వృద్ధులువరకు ఎంత వయస్సుండినను వాడుకోవచ్చును.

25 మాత్రలు గల బుడ్డి 1-కి రు. 1=00

తపాలా చార్జి రు. 1=12

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్‌పెట్టె నెం. 1376, మద్రాసు-1.


# త్రాగుబోతు

రచన: మేరువు గణేష్‌బాబు

మా స్కూల్లో రఘునాథరావనే మాష్టారు వుండేవారు. చాలా మంచి వాడు. ఎవరు ఏమన్నా, మెత్తగా వారిని చీవాట్లుపెట్టి ఎదుటివారి మనస్సు నేమాత్రం బాధపడకుండా బుద్ధి చెప్పేవారు.

మా క్లాసులో కిష్టయ్యా అనే పెంకి ఘటం ఒకడు వుండేవాడు. వాడికి ఏ మాత్రం భయభక్తులులేవు. మాష్టర్లను ఏదో ఒకటి అంటాడు. అవి విని కూడ ఏమీ అనలేకపోతూ వుండేవారు. కారణం?...వాడే మా స్కూలు అంతటికి వయస్సులో పెద్దవాడు. మాతో కోరి కయ్యాలు పెట్టుకొనేవాడు. వాడికి తగిన గర్వభంగం ఎప్పుడు జరుగుతుందా? అని ఎదురు చూస్తున్నాం.

ఒకనాడు రఘునాథంగారు మాకు ఇంగ్లీషు చెబుతున్నారు. ఆయన పాఠం బాగాచెప్తారు. కాబట్టి అల్లరిచేయకుండా కూర్చున్నాం. ఇంతలో హీరో కిష్టయ్యా లేచాడు ఫోజుగా "మేష్టారూ! నేను మంచి నీళ్ళకు పైకి వెళ్ళాలండి!" అన్నాడు. పాఠం మధ్యలో డిస్టర్బన్సు చేసినందుకు రఘునాథంగారితో పాటు మా క్కూడా కోపం వచ్చింది.

వెంటనే మాష్టారు అన్నాడు "ఏమయ్యా త్రాగుబోతు! క్లాసయ్యాక వెళ్ళలేకపోయావా?"

గొల్లున నవ్వాం మేము. కిష్టయ్యా కోపంతో చిందులు త్రొక్కాడు వాణ్ణి త్రాగుబోతన్నందుకు. వెంటనే రఘునాథంగారు "ఏం కిష్టయ్యా! నువ్వు ఇప్పుడు మంచి నీళ్ళు త్రాగుతానన్నావు కదా! ఇది పీరియడు. స్కూలుకు వచ్చేముందు మంచి నీళ్ళు త్రాగావు కదా. ఇంకా పావు గంట అవందే మళ్లీ త్రాగడానికి వెళ్తున్నావు. అంచేత నీవు త్రాగుబోతువి! ఏమంటావ్?" అన్నాడు నవ్వుతూ. మేం మరింత హెచ్చుగా నవ్వాం. కిష్టయ్యా మొహం నయాపైసా అంతై కుర్చీలో కూర్చున్నాడు ఓడిపోయిన పోజుతో. ★